

హత్యకేసులో నిందితుల అరెస్టు

తాగి వచ్చి కొడుతుండటంతో, భరించలేక తమ్ముడితో కలిసి కట్టుకున్న వాడిని అంత మొందించిన హత్యకేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. -10లో



కళ్లల్లో కారం చల్లి.. ఫైనాన్షియర్ కిడ్నాప్

ప్రొద్దుటూరులో ప్రముఖ ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డిని కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.290
రెండోరకం	రూ.150	రూ.220



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 150 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	570	615
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 277.920 కిలోలు

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విభాగ కమిటీల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన దిగువ పేర్కొన్న నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాలలో నియ మిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర రైతు విభాగం సంయుక్త కార్యదర్శిగా మదనపల్లెకు చెందిన టి. నాగరా జరెడ్డి, రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శిగా రాయచోటికి చెందిన షేక్ రియాజ్ ఉర్ రెహ మాన్, రాష్ట్ర సోషల్ మీడియా విభాగం కార్యదర్శిగా రాయచోటికి చెందిన ఎం. ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శులుగా శివ(తంబళ్లపల్లె), వి. హరి(పీలేరు), ఎస్సీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పీలేరుకు చెందిన మద్దెల రవీంద్రలను నియమించారు.

ఆలయాలు శుభ్రంగా ఉంచుకోవాలి



అయ్యప్పస్వామి ఆలయంలో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న దేవదాయశాఖ జిల్లా అధికారి

మదనపల్లె సిటీ: ఆలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ అన్నారు. శనివారం స్థానిక అయ్యప్ప నగర్‌లోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో జరుగుతున్న ఫ్లోరింగ్ కాంక్రీట్ పనులను పరిశీ లించారు.పరిశుభ్రత పాటిస్తే ఆలయాలకు భక్తులు మరింతమంది వస్తారన్నారు. దసరా ఉత్సవాలకు జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో పూజలు, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేస్తారన్నారు దాతలు ఆలయాల అభివృద్ధికి చేయూత ఇవ్వాలని కోరారు. ఈఓ రమణ, అయ్యప్ప సేవా బృందం సభ్యులు జర్మనీ రాజు,హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వదలని వాన



నిండుకుండలా ఝరికోన ప్రాజెక్టు

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు.
- రాయచోటిలో 145.4 మిల్లీమీటర్ల వర్షం
- దెబ్బతిన్న రహదారులు, కూలిన గోడలు

రాయచోటి: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గత నాలుగు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తోం ది. చాలా ప్రాంతాల్లో వంకలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.రహదారులు దెబ్బతిన్నాయి. శని వారం జిల్లా కేంద్రం రాయచోటిలో సుమారుగా మూడు గంటల పాటు భారీ వర్షం కురిసింది. రహ దారులు జలమయమయ్యాయి. వర్షం నీరు మురుగు కాలువల్లో ప్రవహించడంతో ఆ నీటిలో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. రాయచోటిలో 145.4 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదు కావడం విశేషం. జిల్లాలో 40 శాతం పైగా చెరువులు నిండాయి. సంబేపల్లి మండలం పరి ధిలోని ఝరికోన ప్రాజెక్ట్ నుంచి అలుగు ద్వారా బహుదా నదిలోకి వరద నీరు పారుతోంది. గాలి వీడు సమీపంలోని కుశావతి ప్రాజెక్టు నీటితో పర వళ్లు తొక్కుతోంది. పింఛా డ్యాంలోకి పైభాగం నుం చి నీరు వస్తుండడంతో గేట్ల ద్వారా నదిలోకి విడు దల చేస్తున్నారు. తంబళ్లపల్లె, ములకలచెరువు, మదనపల్లె, బి.కొత్తకోట, పెద్దతిప్ప సముద్రం, పెద్దమండెం, కురబలకోట, కె.వి పల్లి, గాలివీడు, సుండుపల్లి, కలకడ, కలికిరి, మండలాల్లో చెరు వులు, కుంటలు, చెక్ డ్యాములు వర్షపు నీటితో నిం డిపోయాయి. వీరబల్లి మండలంలో మాండవ్య నది ఉధృతంగా ప్రవహించింది. నదిపైన నిర్మిం చిన తాత్కాలిక కాజ్‌వే పూర్తిగా తెగిపోయింది. దీం తో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులకు గుర య్యారు. ఒంటిమిట్ట చెరువుకు వరదనీరు వచ్చి చేరుతోంది. సుమారు ఐదేళ్లుగా ఈ చెరువులో నీరు లేక బోరు బావుల్లో నీటి శాతం తగ్గిపోయి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.నీరు రావడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రాయచోటి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని కొత్తపల్లి, గున్నికుంట్ల రోడ్డు, కె.రామాపురం, కొత్తపేట ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో సామగ్రి బురదమయమైంది. షాపుల్లోని సరు కులు నానిపోయాయి.దీంతో ప్రజలు, వ్యాపారులు నష్టపోయారు. పలు ప్రాంతాల్లో గోడలు నాని కూలిపోయాయి.



ఒంటిమిట్ట చెరువులోకి చేరిన వరదనీరు



వీరబల్లి: మాండవ్య నదిపై నిర్మించిన తాత్కాలిక కాజ్‌వే కొట్టుకుపోయిన దృశ్యం

వర్షపాతం వివరాలు

రాయచోటి 145.4 మి.మీ, పెద్దమండెం 98.8, పెనగలూరు 74.6, చిన్నమండెం 63, సుండు పల్లె 55.8, సంబేపల్లె 52.8, నందలూరు 49, గుర్రంకొండ 45, మదనపల్లె 42, గాలివీడు 42, కేవీ పల్లె 39.8, పుల్లంపేట 37.6, రామస ముద్రం 36.2, లక్కిరెడ్డిపల్లె 35 వీరబల్లి 31.8, కలకడ 28.4, తంబళ్లపల్లె 26.2, ముల కలచెరువు 25.2, వాల్మీకిపురం 23.6, పీలేరు 16, రాజంపేట 13.2, నిమ్మనపల్లె 11.4, కురబలకోట 10.2, కలికిరి 8.2, బి కొత్తకోట 6.8, పెద్ద తిప్ప సముద్రం 6.2, కోడూరు 4.6, ఓబులవారిపల్లి 4.2, చిట్వేలి 3.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.



రాయచోటిలోని కలాం వీధిలో వర్షానికి పడిపోయిన గోడ

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి: జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, సిబ్బం ది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కలె క్టరేట్‌లో మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు, రాయచోటి ఆర్డీఓ, వివిధ శాఖల జిల్లా అధికా రులు అన్ని మండలాల తహసీల్దార్లు, మున్సి పల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావే శాన్ని నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పొంగుతున్న నదులు, వాగులు, వంకల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల వల్ల తెగిపోయే రహదా రులు, కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిలిపి వేయాలన్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని రాయచోటి, రాజంపేట, మదనపల్లె, బి కొత్తపేట మున్సిపల్ కమిషనర్లను ఆదేశించా రు.షెల్టర్ కేంద్రాలు, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

'బీటెక్'ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్: ప్రొద్దుటూరులోని వైవీయూ వైఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫస్ట్, సెకండ్, థర్డ్ బీటెక్ కోర్సులకు సంబంధించి రెండో సెమిస్టర్ ఫలితాలను శనివారం వైవీయూలో వీసీ అల్లం శ్రీనివాసరావు తన చాంబర్లో విడు దల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ ఏడాది మే నెలలో బి.టెక్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఫలితాలను విశ్వవిద్యా లయ వెబ్సైట్ https:www.yvuexams.in /results.aspx సందర్శించి తెలుసుకోవచ్చన్నా రు.పరీక్షల విభాగాన్ని, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వీసీ ప్రశంసించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రొద్దుటూరు వైఎస్ఆర్. వైవీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. జయరామిరెడ్డి పాల్గొన్నారు.

'జై భీమ్' కొనసాగాలంటే

జగనన్న పాలన రావాలి





సమావేశానికి హాజరైన ఎస్సీసెల్‌నేతలు, ఆకేపాటి ఎస్టేట్‌లోని ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీసెల్‌రాష్ట్ర అధ్యక్షుడు టీజెఆర్ సుధాకర్‌బాబు

- కూటమి పాలనలో సామాజిక అన్యాయం
- సూపర్‌సిక్స్ పథకాలతో దళితులకు గుండుసున్న
- వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు

రాజంపేట: రాష్ట్రంలో జైభీమ్ నినాదం కొనసాగా లంటే జగనన్న పాలన రావడం తప్పనిసరి అని, ఆ దిశగా జగనన్న దళితఫోర్స్ సైనికుల్లా పనిచే యాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజెఆర్ సుధాకర్‌బాబు అన్నారు. శనివారం ఆకే పాటి ఎస్టేట్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన జిల్లా ఎస్సీసెల్ జిల్లా కార్యవర్గ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో దళితులపై జరు గుతున్న దాడులను, సామాజిక అన్యాయాన్ని ప్రతి ఒక్క దళితుడు గుర్తుంచుకోవాల్సిన ఆవశ్య కత ఉందన్నారు.డిప్యూటీ సీఎం పవన్ నియోజక వర్గంలో దళితులను బహిష్కరణకు గురైన సం ఘటనను ఆయన వివరించారు. కర్నూలు జిల్లా పత్తికొండలో మాదిగపల్లెపై దాడులు చేసిన తరుణంలో ప్రాణరక్షణ కల్పించాలని మొరపెట్టు కున్నా ప్రభుత్వం, పోలీసులు స్పందించకపోవడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. పీపీపీ పద్ధతిలో మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసే విధంగా తీసుకున్న నిర్ణయం వల్ల పరో క్షంగా సామాజిక అన్యాయం చేసినట్లే అని అన్నారు. కూటమి దళితుల పట్ల వ్యవహరిస్తున్న తీరును చరిత్ర ఎన్నటికీ మరిచిపోదన్నారు. చంద్ర బాబు పాలనలో జరుగుతున్న సామాజిక అన్యాయంపై తిరుగుబాటుతప్పదన్నారు. సూప ర్‌సిక్స్‌లో మూడు పథకాలతో దళితులకు గుండు సున్నా అని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు దళితుల అభ్యున్నతి, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. రాజకీయం గా, ఆర్థికంగా దళితులను ఎదగడానికి జగనన్న పాలన దోహదపడిందని గుర్తుచేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి వచ్చినా ఈ సారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమని జోష్యం చెప్పారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎస్సీ కమిటీలను బలోపేతం చేస్తామన్నారు. ఆదిశగా మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలో మండల, గ్రామ, నియోజకవర్గ స్థాయి కమిటీల నియామకం పూర్త వుతోందన్నారు. జిల్లాలో ఎస్సీ కమిటీలు పూర్తి చేయడంలో ముందంజలో ఉందని, ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి కృ షి ఉందని కొనియాడారు. ఎస్సీల సంక్షేమాన్ని చంద్రబాబు మరిచారన్నారు. ఎస్సీ,ఎస్టీలను డిప్యూటీసీఎం చేసిన ఘనత జగనన్నకే దక్కుతుం దన్నారు. డీబీటీ విధానంలో రాష్ట్రంలో ఒక్క ఎస్సీ సామాజిక వర్గానికే రూ.9,154 కోట్లు ఆర్థిక ప్రయోజనం కల్పించారన్నారు. జగన్‌మోహనరెడ్డి మళ్లీ సీఎం చేసుకోవాలని, లేదంటే నష్టపోతామని దళిత సామాజికవర్గాలు గుర్తుంచుకోవాలన్నారు.

- ఎస్సీసెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కనకరావు మాట్లా డుతూ వైఎస్సార్‌సీపీ పాలనను, ఇప్పటి కూటమి పాలనను దళితలు బేరీజు చేసుకుంటున్నారన్నారు. బాబు పాలన దళితవర్గాలకు అన్యాయం జరుగు తోందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పెద్దపీట వేసినట్లు చెప్పారు జగనన్నకు దళితులు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాజంపేటలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్టీకి రిజ్వరుడ్ అయితే, దానిని మార్చి ఓసీ నేతకు కట్టబెట్టడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం సామాజిక అన్యాయం చేస్తోం దని అవగతమవుతోందన్నారు.వైఎస్సార్‌సీపీ దళిత నేతలు పులిసునీల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రం గాల కమలాకర్, నందలూరు మండల ఉపాధ్య క్షుడు నాయనపల్లె అనుదీప్, రమణ, చంద్ర, జయ రామచంద్ర, మోహన్, తిప్పన దుర్గయ్య, అం జనప్ప, లింగం లక్ష్మీకర్, చిన్నయల్లయ్య, ఎముక దుర్గయ్య, నాగసుబ్బయ్య, భక్తుడు, రామ్మోహన్‌లు ప్రసంగించారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, దివంగత సీఎం వైఎస్‌రాజశే ఖర్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు నివాళులు అర్పించారు. సమావేశంలో డీసీఎంస్ మాజీ చైర్మన్ దండుగోపి, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చుక్కా అంజనప్ప, వైస్‌ఎంపీపీ బాబు, జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య, కాకిచంద్ర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళ కార్యదర్శి బీరంగి రేవతి, నేతలు బీఎం కుసుమకుమారి, జీ.నాగమణి, రాజంపేట ఎంపీపీ ఆర్వెళ్ల రమణమ్మ యాదవ్, రైల్వేకోడూరు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు తిప్పన దుర్గయ్య, రాయచోటి నియోజకవర్గ అధ్యక్షుడు అంకె ఆంజనేయులు,బూత్‌కమిటి నియోజకవర్గ అధ్యక్షుడు తిప్పన నాగభూషణం, రెడ్డయ్య, నాగ రాజు, సురేష్, చలపతి, నాగరాజు,ఓబులేశు, ప్రసా ద్,నాగయ్య, రెడ్డప్ప, ఆంజనేయులు,సాయికు మార్,సంతోష్, రామాంజులు, శ్రీనివాసులు, పవ న్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

దళితవర్గాలను చైతన్యవంతులు చేయాలి



ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై దళితవర్గాలను చైతన్యం చేయాల్సిన బాధ్య త ఎస్సీ, ఎస్టీ అనుబంధ సం ఘాల నేతలపై ఉంది. కూటమి ప్రభుత్వం పాల నలో విఫలమైంది. దళితులు ఎప్పుడూ వైఎస్సార్‌కు టుంబానికి వెన్నుదున్నుగా ఉంటారన్నారు. దివం గత వైఎస్సార్, పార్టీ అధినేత, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంటే దళితులకు ఎనలేని అభిమానం.

–ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

కార్యకర్తలకే పెద్దపీట



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే కార్యకర్తలకే పెద్దపీట. జగన్ 2.0 పాలన తప్పకుం డా వస్తుంది. దళితుల అభ్యున్నతి జగనన్నతోనే సాధ్యం. సమష్టి కృషితో జగ న్‌ను మరోసారి సీఎం చేసుకుందాం. అన్ని వర్గాల మధ్య చిచ్చుపెట్టి చలికాచుకోవడం చంద్రబాబు నైజం. దళితులకు వైఎస్సార్, జగన్‌ల హయంలోనే న్యాయం జరిగింది.

–గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

కూటమి పాలనలో ఎస్సీలపై దాడులు పెరిగాయి



కూటమి ప్రభుత్వం వచ్చాక దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయి.రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాం గం కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత దళితులు, మైనార్టీలు, పేదలపై ఉం ది.

–నిసార్ అహమ్మద్, ఇన్‌చార్జి, మదనపల్లె

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో శనివారం శాస్త్రోక్తంగా స్నపన తిరు మంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ ఏకశిలపై వెల సిన సీతారామ లక్ష్మణ మూర్తులకు నూతన పట్టు వస్త్రాలు, పండ్లు, పూలను సమర్పించారు. అనం తరం గర్భాలయంలోని మూలవిరాట్‌కు పంచా మృతాభిషేకాలు జరిపారు. పట్టు వస్త్రాలు, తులసి, గజమాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో అధిక సం ఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



పట్టువస్త్రాలు, పండ్లు, పూలు తీసుకొస్తున్న టీటీడీ అధికారులు

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

కలకడ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థు లకు రుచికరమైన భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం ఉపాధ్యాయులను, మధ్యాహ్నభోజన పథకం సిబ్బందిని ఆదేశించారు. గతంలో మల్లంగ్‌షావల్లి ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు పురుగు పట్టిన బియ్యంతో చేసిన అన్నం విద్యా ర్థులకు వడ్డించారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ చేపట్టేందుకు శనివారం కలకడ ఆదర్శపా ఠశాలకు డీఈఓ వచ్చారు. విద్యార్థులు, ఉపా ధ్యాయులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను సేక రించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపు తామని ఆయన తెలిపారు.అనంతరం మధ్యాహ్న భో జనాన్ని పరిశీలించారు.విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్నభోజన పథకం అమలులో ఎలాంటి ఫిర్యాదులు అందినా విచారించి బాధ్యు లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడీ రవికుమార్, జిల్లా స్కౌట్స్, గైడ్స్ అధికారి నరసిం హారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి నివా రణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి మండలం కుర్నూతుల పంచా యతీలోని వేల్పుచెర్లవాళ్లపల్లి, కుర్నూతుల గ్రామాల్లో పశుగణాభివృద్ధి సంస్థ కడపవారి ఆధ్వర్యంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వ హించారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ పశు వులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం పశువుల పోషణకు అ వసరమైన ఖనిజ మిశ్రమం (మినరల్ మిక్చర్) ప్యాకె ట్లను రైతులకు అందించారు. డిప్యూటీ పశువర్ధకశాఖ అధికారి మాలకొండయ్య, పశువైద్యాధికారులు డాక్టర్ మహేష్,శివరాంరెడ్డి, శశికళ తదితరులు పాల్గొన్నారు.



మినరల్ మిక్చర్ ప్యాకెట్లను రైతులకు ఇస్తున్న గుణశేఖర్‌పిళ్లై

క్లుప్తంగా

వేదింపులపై భార్య ఫిర్యాదు

కురబలకోట : అత్త, భర్త వేధింపులు ఎక్కువయ్యాయని, వారి నుంచి ప్రాణహాని పొంచియుందని నందిరెడ్డిగారిపల్లెకు చెందిన అర్షియా ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదేళ్ల కిందట ఖాదర్‌వలితో వివాహం కాగా.. అదనపు కట్నం తేవాలని.. లేదంటే అతడికి మరో పెళ్లి చేస్తామని అత్త వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుమార్లు తనపై చేయి చేసుకున్నారని తెలిపారు. అత్త, భర్త రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని చెన్నరాయునిపల్లి సమీపంలోని ఓ పాల డెయిరీ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. రాజేష్, సురేష్ ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా కర్నాటక రాష్ట్రం చేలూరుకు చెందిన ముజమిల్ (23) మరో వాహనంలో వెళ్తున్నాడు. రెండు వాహనాలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సురేష్(47)కు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో ముజమిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

28న జిల్లా స్థాయి పాటల పోటీలు

రాజంపేట రూరల్ : దివంగత గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని పురస్కరించుకుని భారతీయ విద్యానికేతన్ (బీవీఎస్) స్కూల్ ప్రాగణంలో జిల్లా స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాంజలి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎస్.కళాంజలి కోరారు. విజేతలకు వరుస బహుమతులుగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.1000, శాశ్వత షీల్డ్, ప్రశంసపత్రాన్ని అందజేయనున్నట్లు తెలియజేశారు. పూర్తి వివరాలకు 9490884300, 9490443000 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రైతులు తాము సాగు చేసిన పంటలను తప్పకుండా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. శనివారం రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ కొండవాండ్లపల్లి సమీపంలో సాగు చేసిన నవధాన్యాల పప్పుదినుసు పంటలను ఆయన పరిశీలించారు. రైతులు నవధాన్యాల పప్పుదినుసు పంటలను సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ నాగమణి, మండల ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్, చిట్లూరు వీఏఏ ఆఫ్రిన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకట్రామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఖదీరున్నీసా, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో యూనియన్ల మధ్య ఘర్షణ

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో యూనియన్ల మధ్య శుక్రవారం ఘర్షణ చోటుచేసుంది. టీఎన్‌టీయూసీ యూనియన్‌కు చెందిన మనోహర్, పులి సుధాకర్‌రెడ్డిలకు స్వల్పంగా గాయలయ్యాయి. యూనియన్ నాయకులు కలమల్ల పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయగా పోలీసులు సర్ది చెప్పాల్సి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల డిమాండ్ల సాధన కోసం 23 యూనియన్లు కలిసి జేఏసీగా ఏర్పడిడి ఈ నెల 15వ తేదీ నుంచి నిరసన చేపట్టారు. ప్రభుత్వంలో భాగమైన టీఎన్‌టీయూసీ, బీఎంఎస్ యూనియన్లు కాంట్రాక్టు కార్మికుల కోసం వేరుగా నిరసన ప్రదర్శన నిర్వహించాయి. శనివారం జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం కాగా, అదే సమయంలో గేటు బయట టీఎన్‌టీయూసీ, బీఎంఎస్ యూనియన్లు నిరసన చేపట్టాయి. విధులకు వెళ్తున్న ఉద్యోగ, కార్మికులను రెండు యూనియన్ల నేతలు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుని తోపులాట జరిగింది. టీఎన్‌టీయూసీ యూనియన్‌కు చెందిన మనోహర్, పులి సుధాకర్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. దీంతో యూనియన్ నేతలు కలమల్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ అంతా కలిసి చర్చించుకుని సర్దుబాటు అయ్యారు. జేఏసీ నేతలు క్షమాపణ చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.



ఆర్టీపీపీలో ఘర్షణ పడుతున్న యూనియన్ నాయకులు



గాయం చూపుతున్న మనోహర్

కూలీ ప్రాణాలు తీసిన టిప్పర్..!



పి. సుధాకర్ (ఫైల్)

కురబలకోట : హైవే పక్కన రాంగ్ సైడ్‌లో నిలిపిన టిప్పర్‌ను మోటార్ సైకిల్‌పై వచ్చిన వ్యక్తి ఢీకొని మృతి చెందిన విషాదకర సంఘటన కురబలకోట మండలంలో శనివారం చోటుచేసుకుంది. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం వాల్మీకీ నగర్‌కు చెందిన పి.సుధాకర్ (56) కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుమార్తెను శుక్రవారం రాయచోటిలోని చెల్లెలు ఇంటి వద్ద వదిలి వస్తానని సుధాకర్ మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. భార్య రాత్రి పది గంటల సమయంలో ఫోన్ చేయగా వర్షం ఆగగానే ఇంటికి వచ్చేస్తానని బదులిచ్చాడు. శనివారం రాత్రి తిరిగి ఇంటికి వస్తుండగా ముదివేడు సమీపంలోని తానామిట్ట వద్ద ఆగిన టిప్పర్‌ను ప్రమాదవశాత్తూ ఢీకొట్టాడు. టిప్పర్‌ను రాంగ్ సైడ్‌లో ఆపి సిగ్నల్స్ కూడా వేయకపోవడమే ఇందుకు కారణమైంది. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం ప్రాణాన్ని బలితీసుకుంది. శనివారం వేకువ జామున మృతి వార్త తెలుసుకుని భార్య, పిల్లలు విలపించారు. అమ్మా.. నాన్నకు ఏమైంది.. నాన్న ఎక్కడమ్మా..అని పిల్లలు రోధించడం చూపరుల కళ్లను చెమర్చాయి. మదనపల్లె ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

సోమశిల జలాలతో మునిగిన పొలాలు



బ్యాక్ వాటర్‌తో గుంజనేరు పొర్లి పంట పొలాల్లోకి వచ్చిన దృశ్యం

పెనగలూరు : సోమశిల వెనుక జలాలు పెరగడంతో సిరివరి గ్రామానికి చెందిన వందల ఎకరాల పంట నీట మునిగింది. మామిడి తోటల్లోకి నీరు చేరడంతో చెట్లు చనిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమశిల ప్రాజెక్టు సామర్థ్యం 78 టీఎంసీలు కాగా 72 టీఎంసీలు నిల్వచేశారు. దీంతో సిరివరం, ఎస్ఆర్.పురం గ్రామంలోని చాలా పొలాలకు నీరు చేరింది. వారం పది రోజులలో కోసేందుకు వరి పంట సిద్ధంగా ఉండగా. నీట మునగడంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైంది. అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



గీర్వాణి (ఫైల్)

మదనపల్లె రూరల్ : ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎం గ్రామం పడమట వీధికి చెందిన గీర్వాణి(60) మాజీ సైనికోద్యోగి అయిన తన భర్త మురళీతో కలిసి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతోంది. మదనపల్లె నుంచి పీలేరు వెళుతున్న ఆర్టీసీ అద్దె వాహనం ఓవర్‌టేక్ చేస్తూ పక్కకు వెళ్లే క్రమంలో వారి ద్విచక్రవాహనాన్ని తాకింది. దీంతో బైక్ అదుపుతప్పి గీర్వాణి, మురళీ కిందపడ్డారు. ప్రమాదంలో గీర్వాణి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతితో ఆవేశానికి లోనైన కుటుంబసభ్యులు బస్సు డ్రైవర్ జానకిరామ్‌పై దాడి చేశారు. తమకు కేసు, పోస్టుమార్టం వద్దంటూ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. తాలూకా పోలీసులు విచారణ చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు.

నిందితుల అరెస్టు

మదనపల్లె రూరల్ : తమ్ముడితో కలిసి కట్టుకున్న వాడిని అంతమొందించిన హత్య కేసులో నిందితులను అరెస్టుచేసినట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సత్యసాయిజిల్లా తనకల్లు మండలం నందివారిపల్లెకు చెందిన జరిపిటి రామన్న(40) మద్యం మత్తులో రోజూ భార్య రమణమ్మతో గొడవపడేవారు. 2025 మార్చి, 12న యథాప్రకారం గొడవపడగా.. భార్య రమణమ్మ పప్పుగుత్తితో భర్త రామన్నపై దాడి చేసింది. అప్పటికే అక్కడే ఉన్న ఆమె తమ్ముడు ఈశ్వర్ కూడా అక్కను కాపాడే క్రమంలో రుబ్బురోలు తీసుకుని రామన్నపై దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. హంద్రీనీవా కాల్వ వద్ద మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. మృతుడి సోదరుడు జరిపిటి లక్ష్మన్న ఫిర్యాదుతో విచారించిన పోలీసులు ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం తెలిపారు. నిందితులను అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన పప్పుగుత్తి, రుబ్బురోలు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. కేసు ఛేదించడంలో ప్రతిభ కనపరిచిన సీఐ రాజారెడ్డి, ఎస్‌ఐ రహీముల్లా, హెడ్‌కానిస్టేబుల్ వేణు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం దిగువహరిజనవాడకు చెందిన వెంకటప్ప కుమారుడు అంజప్ప(45) భార్య నాలుగేళ్ల కిందట మృతి చెందడంతో ఒంటరి జీవితాన్ని భరించలేకపోయాడు. మానసికంగా కుంగిన అతడు ఇంటివద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గుర్రంకొండ మండలం సరిమడుగు పంచాయతీ కృష్ణాపురానికి చెందిన చౌడప్ప కుమారుడు చలపతి(48) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబసభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

తమ్ముళ్లు డిష్యుం.. డిష్యుం..

రక్త గాయాలతో ఆసుపత్రికి చేరిక

టాస్క్ ఫోర్స్ : ఓటమి పాలన ప్రారంభమైనప్పటి నుంచి దౌర్జన్యాలు, రౌడీయిజం, దాడులు అధికమయ్యాయి. పార్టీలతో సంబంధం లేకుండా ఆర్థిక లావాదేవీలే పెట్టుబడిగా తెలుగు తమ్ముళ్లు దాడులకు తెగబడుతున్నారు. ఈ క్రమంలో ఒక్కోసారి ఆర్థిక, భూ పంపకాలు, మద్యం మత్తుల్లో తెలుగు తమ్ముళ్లే ఒకరికి ఒకరు దాడులు చేసుకుంటూ ప్రజలను భయకంపితులను చేస్తున్నారు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం రాయచోటి పట్టణ తెలుగు యువత అధ్యక్షులు జాబీర్, మరో తెలుగు మైనార్టీ నాయకుడు సయ్యద్ వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడులలో జాబీర్, సయ్యద్ భాషాలు ఇరువురికి తీవ్రంగా రక్త గాయాలు అయ్యాయి. మదనపల్లి మార్గంలోని భూ తగదా విషయంపై ఇరువురి మధ్య ఈ ఘర్షణ తలెత్తినట్లు సమాచారం. అయితే అధికార పార్టీకి చెందిన ఇరువురు పోలీస్ స్టేషన్ కి వెళ్లకుండా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

ఇద్దరు మైనర్ల అరెస్టు

వేంపల్లె : స్థానిక పిల్లస్వామి గుట్ట సమీపంలోని జగనన్న కాలనీలో ఈ నెల 18వ తేదీన వాణి తన ఇంటికి తాళం వేసి వెళ్లారు. అదే కాలనీకి చెందిన ఖాదర్‌వలి, మరో ఇద్దరు మైనర్లు పట్టపగలే ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో బంగారు, వెండి చోరీ చేశారు. విచారించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

కోడిపందేల రాయుళ్లు అరెస్టు

సిద్దవటం : మండలంలోని మిట్టపల్లి సమీపాన రైల్వే బ్రిడ్జి వద్ద కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సిద్దవటం ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. తనకు అందిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం సోదాలు చేయగా రైల్వేబ్రిడ్జి వద్ద కోడి పందెం ఆడుతూ కనిపించారన్నారు. నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 10500 ల నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలోని రాజస్థాన్ డాబా వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రాజంపేట ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంలో కడప నుంచి రాజంపేటకు బయలుదేరారు. భాకరాపేట సమీపంలోని రాజస్థాన్ డాబా వద్దకు రాగానే ముందు వెళ్తున్న కారు వేగంగా ఓవర్‌టేక్ చేసి వెళ్లింది. ద్విచక్ర వాహనంలో వస్తున్న వీరు ముందు వెళ్తున్న ఐచర్ వాహనాన్ని వెనుకవైపు ఢీకొన్నారు. ప్రమాదంలో ఆకేపాడుకు చెందిన కమల్, మనక్కాయల పల్లికి చెందిన రితేష్, రాజంపేటకు చెందిన మున్నాకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని వైద్యంకోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

10 మోటార్ బైక్‌లు స్వాధీనం

మైదుకూరు : తనను బెదిరించి తన మోటార్ బైక్‌ను అగంతుకుడు ఎత్తుకెళ్లాడని ఓ భవన నిర్మాణ కార్మికుడు చేసిన ఫిర్యాదు ఓ అంతర్ రాష్ట్ర దొంగను పట్టించింది. బద్వేల్ ఎన్జీఓ కాలనీ వాసి బ్రహ్మదేవి రాజశ్రీ గణేష్‌ను బ్రహ్మంగారిమఠం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.5 లక్షల విలువచేసే పది మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నారు. మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ వివరాల మేరకు.. ప్రొద్దుటూరులోని వివేకానంద కాలనీకి చెందిన షేక్ హుస్సేన్‌షా బేల్దారిగా పనిచేస్తున్నారు. బ్రహ్మంగారిమఠం ఈశ్వరీదేవి గుహ వద్ద ఈ నెల 16న పనులకు వెళ్లి కొద్ది దూరంలో బైక్ పార్కింగ్ చేశాడు. సాయంత్రం వచ్చి చూడగా.. నిందితుడు రాజశ్రీ గణేష్ తన బైక్‌ను స్టార్ట్ చేస్తుండడడంతో హుస్సేన్‌షా ఎందుకు స్టార్ట్ చేస్తున్నావని ప్రశ్నించాడు. పక్కకు తప్పుకోకుంటటే చంపేస్తానంటూ చాకుతో బెదిరించి బైక్‌లో పరారయ్యాడు. బాధితుడు బ్రహ్మంగారిమఠం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో నిందితుడు రాజశ్రీ గణేష్‌ను పోలీసులు అనుమానించి విచారించారు. విచారణలో హుస్సేన్‌షా మోటార్ బైక్ అని తేలడంతో మరింత విచారణ చేశారు. దీంతో రాష్ట్రంతోపాటు తెలంగాణలోని పలు స్టేషన్ల పరిధిలో తొమ్మిది మోటార్ బైక్‌లు చోరీ చేసినట్లు తెలిసింది. ఓ పాడుబడిన షెడ్‌లో నిందితుడు దాచిన పది మోటార్ బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతేగాక కడప, ఒంటిమిట్ట, నందలూరు ప్రాంతాల్లో ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీ చేసినట్లు నిందితుడిపై కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా నిందితుడిని పట్టుకున్న సీఐ జె.శివశంకర్, బ్రహ్మంగారిమఠం ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి, హుస్సేనయ్య, బ్రహ్మేంద్రలకు నగదు రివార్డులను అందజేశారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

కడప అర్బన్ : కడప హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన విజయభాస్కర్‌రెడ్డితోపాటు కుమార్తె రూప తన్మయి, సుజిత్‌కుమార్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ బి.రామకృష్ణ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. అరవింద్‌నగర్‌కు చెందిన నిత్య పద్మావతి 2019లో ఐదు ఆయిల్ ట్యాంకర్లను కొనుగోలు చేశారు. వాటి నిర్వహణ బాధ్యత విజయభాస్కర్ రెడ్డికి అప్పగించారు. ఆయన నిపద్మావతి దగ్గర సంతకాలు చేసిన చెక్కు ఇప్పించుకున్నాడు. కుట్రపన్ని దాదాపు రూ.90 లక్షల మేర తాను, తమ ఇద్దరు పిల్లల ద్వారా డబ్బు డ్రా చేసుకుని ఖర్చు చేసుకున్నారు. ఆయిల్ ట్యాంకర్ల ఈఎంఐలను కట్టించడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



కార్మికులకు మద్దతు తెలుపుతున్న ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : ఏళ్ల తరబడి పని చేస్తున్న విద్యుత్తు కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో శనివారం రాయచోటి పట్టణంలోని విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్కం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులందరినీ తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేయాలని, థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దు చేయాలని కోరారు. అనంతరం కార్మికులకు విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ యుగంధర్ మద్దతు తెలిపారు. డిమాండ్ల సాధనకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరి, ఏవీ.రమణ, రెడ్డప్ప, కిరణ్, శ్రీనివాసనాయుడు, అమరనాథరెడ్డి, రామాంజి, శ్రీనివాసులు, స్వాతి, సుజాత, సరస్వతి, నాగేష్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, బాలకృష్ణ, సురేంద్ర, నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలకు మంగళం పాడిన ప్రభుత్వం



పాడె కట్టి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మదనపల్లె రూరల్ : ప్రభుత్వ వైద్య కళాశాలలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట పాడె కట్టి శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ఓపెన్ మార్కెట్లో వ్యాపారానికి పెట్టిందన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యాన్ని దూరం చేయడంతో పాటు వైద్యవిద్యను అభ్యసించాలనుకున్న పేద విద్యార్థుల ఆశలను చిదిమేస్తోందన్నారు. ప్రైవేటీకరించకుంటే ఆయా కళాశాలల్లో ఓపీ, మెడికల్ టెస్టులు, మందులకు ఎలాంటి ఫీజులు వసూలుచేయమని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీ-4 పేరుతో కార్పొరేటైజేషన్, కమర్షియలైజేషన్, కమ్యూనలైజేషన్, సెంట్రలైజేషన్ అమలు చేస్తోందన్నారు. బనకచర్లకు రూ.81వేల కోట్లరూపాయలు ఖర్చు చేసే రాష్ట్ర ప్రభుత్వం రూ.8వేల కోట్ల రూపాయలు మెడికల్ కాలేజీలకు ఎందుకు ఖర్చుపెట్టలేకపోతోందని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీలను ప్రభుత్వరంగంలో కొనసాగించేలా అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, తీర్మానం చేసి ఆమోదం తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి, రెడ్డి, నరేష్, ఏఐఎస్ఎఫ్ మాధవ్, దేవా, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

వీఆర్ఏలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం



సబ్ కలెక్టర్ భావనకు విన్నవిస్తున్న నాయకులు

రాజంపేట రూరల్ : రాష్ట్రంలో వీఆర్ఏలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా కూటమి ప్రభుత్వం అడుగడుగునా విస్మరిస్తోందని వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ మండిపడ్డారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ)ల సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో బందగీ సాహెబ్ మాట్లాడుతూ వీఆర్ఎలకు 8 సంవత్సరాలుగా వేతనాలు పెరగలేదని వాపోయారు. జీతం బెత్తెడు ఇస్తూ అక్రమంగా బండ చాకిరీ చేయించుకుంటూన్నారని వాపోయారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పేస్కేల్ అమలు చేయాలన్నారు. అనంతరం ఎన్జీఓ హోమ్ నుంచి సబ్ కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా నిర్వహించి సబ్ కలెక్టర్ భావనకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సీహెచ్.చంద్రశేఖర్, రవి కుమార్, మధు, మోడీప్రసాద్, లక్ష్మీకర్, మని, నరసింహులు, కోటీ, తిరుపాలు, ఖాదరవల్లి, లావణ్య, రత్నమ్మ, తదితరులు పాల్గొరు.

పెట్రోలు బంక్ నిధుల స్వాహా కేసులో పురోగతి

రాజంపేట డీఎం, మరో ఐదుగురి సస్పెన్షన్



రాజంపేట డీఎం రమణయ్య

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకులో నిధుల స్వాహా కేసు కొలిక్కి వచ్చింది. రాజంపేట డీఎం గుండాల రమణయ్య, మరో ఐదుగురిని సస్పెండ్ చేస్తూ ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో కండక్టర్ బాలాజీ పెట్రోలు బంక్ సొమ్ము స్వాహా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సాక్షి దినపత్రికలో వరుస కథనాలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ కొనసాగించారు. దీంతో పోన్‌పే, డీజిల్, పెట్రోలు నిల్వలు, రికార్డులు మెయింటెన్‌లో లోపాలతో దాదాపు రూ.63 లక్షల వరకు సొమ్ము కనిపించడంలేదని తేలింది. కడప డీపీటీఓ గోపాల్‌రెడ్డి డిపో కార్యాలయానికి వచ్చి దాదాపు రూ.63 లక్షల నిధులు స్వాహా అయ్యాయని నిర్ధారణకు వచ్చామన్నారు. డిపోకు చెందిన డీఎం తోపాటు, ఎంఎఫ్.ధరణి భాయి, డిపో క్లర్క్ టీఆర్‌నాయుడు, ఎడీసీ టీఎల్ నరసయ్య, సీనియర్ అసిస్టెంట్ డీఆర్ మోహన్, జూనియర్ క్లర్క్ టీఎస్ నారాయణలపై వేటు వేసినట్లు తెలిపారు. శనివారం పెట్రోలు బంక్‌కు తాళాలు వేశారు. వాహనదారులు వచ్చి వెనుదిరుగుతున్నారు.

కళ్లల్లో కారం చల్లి.. ఫైనాన్షియర్ కిడ్నాప్



కిడ్నాప్‌కు గురైన వేణు గోపాల్‌రెడ్డి (ఫైల్)



వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో ప్రముఖ ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డిని కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. శుక్రవారం రాత్రి స్కూటీలో ఇంటికి వస్తుండగా దారి మధ్యలో కాపు కాచిన దుండగులు కళ్లలో కారంపొడి చల్లి కిడ్నాప్ చేసి కారులో తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొల్లవరం ప్రాంతానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి కొన్నేళ్ల క్రితం జమ్మలమడుగు రోడ్డులోని బొల్లవరం మున్సిపల్ ప్లాట్‌లలో విశాలమైన భవంతి నిర్మించుకొని అక్కడే ఉంటున్నారు. ఆయన వడ్డీకి అప్పులిస్తుంటాడు. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలు కావస్తున్నా ఇంటికి రాకపోవడంతో కుమార్తె స్వప్న వేణుగోపాల్‌రెడ్డికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్‌లో ఉంది. మరో నంబర్ అందుబాటులో లేదు. కొద్ది సేపటి తర్వాత వాచ్‌మెన్ బయటికి వెళ్లి చూడగా జమ్మలమడుగు రహదారిలోని ఆర్చి వద్ద వేణుగోపాల్‌రెడ్డి స్కూటీ కిందపడి పోయి ఉంది. వాచ్‌మెన్ కేకలు వేయడంతో ప్రమీలా దేవి, కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చారు. స్కూటీ పక్కనే వేణుగోపాల్‌రెడ్డి చెప్పులతోపాటు కారంపొడి పడి ఉండటంతో ఎవరో ఆయనను కిడ్నాప్ చేశారని భావించిన కుటుంబ సభ్యులు బోరున విలపించసాగారు. రూరల్ ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి రాత్రంతా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కొందరు వ్యక్తులు కారులో వేణగోపాల్‌రెడ్డిని ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. ప్రమీలాదేవి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. తమకు డబ్బు ఇవ్వాల్సిన వాళ్లే తన భర్త వేణుగోపాల్‌రెడ్డిని కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లి ఉంటారని ప్రమీలాదేవి తెలిపారు. తమకు బాకీ ఉన్నవాళ్లు తన భర్తకు హాని తలపెట్టేలా ఉన్నారని ఆమె రోదించింది.

ప్రొద్దుటూరులో లేఖ కలకలం

బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు వసూలుచేస్తున్నారని ఆరోపణ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ప్రొద్దుటూరు పట్టణంలో కొందరు బ్లాక్ మెయిల్ చేస్తూ జేబులు నింపుకొంటున్నారని పట్టణ ప్రముఖులపై ఏకే.రామాంజనేయులు రాసిన లేఖ శనివారం కలకలం సృష్టించింది. లేఖలో వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో బీజేపీ నాయకుడు గొర్రె శ్రీనివాసులు బ్లాక్ మెయిల్ దందాకు పాల్పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. రెండు దశాబ్దాల కిందట అగస్త్యేశ్వరస్వామి ఆలయ నిర్మాణ వివాదంలోనూ, మిట్టా పాపయ్య సత్రం, నందినీ క్లాత్ మార్కెట్ విషయంలోనూ వివాదాలను ఆసరాగా తీసుకుని గోసంగి వెంకటసుబ్బారెడ్డి, గొర్రె శ్రీనివాసులు బ్లాక్ మెయిల్‌కు పాల్పడగా వారికి బుశెట్టి రామ్మోహన్‌రావు సహకరించారని ఆరోపించారు. ధారా అపార్ట్‌మెంట్ నిర్మాణంపై లెక్కలేనని పిటీషన్లు పెట్టి బ్లాక్ మెయిల్ చేసి డబ్బు సంపాదించారని ఆరోపించారు. డీఏడబ్ల్యూ కళాశాల వివాదంలో ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పైనా డీఎల్.రవీంద్రారెడ్డితో ఫిర్యాదు చేయించి రూ.50 లక్షల వరకూ వసూలు చేశారన్నారు. గోపీ రైస్‌మిల్లుపై వందల కొద్దీ పిటీషన్లు, ఆర్టీఐ అప్లికేషన్లు పెట్టి రూ.8కోట్లు అక్రమంగా సంపాదించారని, బొల్లవరంలో పల్లేటి సుహాసినిని మధ్యపెట్టి డబ్బు సంపాదించారని ఆరోపించారు. ఇందులో టీడీపీ నాయకుడు ఉక్కు ప్రవీణ్ అనుచరుడు వాటర్‌ప్లాంట్ రాము, నీలకంఠారెడ్డి ఉన్నారన్నారు. చౌటపల్లె నిక్లస్ దొరకు చెందినదిగా చెప్పబడుతున్న మూడు ఎకరాల స్థలాన్ని దొంగగా రిజిస్ట్రేషన్ చేయించుకుని కబ్జా చేయాలని యత్నించినట్లు పేర్కొన్నారు. నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, మరికొందరు వేసిన వెంచర్లపై ఆర్టీఐ యాక్ట్ పెట్టి బెదిరించారన్నారు. 2023లో రాజా ఫౌండేషన్‌పై వారి కళ్లు పడ్డాయని, చిన్నజీయర్‌స్వామిని పరిచయం చేసుకుని కమిటీలో తమ పేర్లను ఎక్కించుకున్నారని, తమకు రూ.75 కోట్ల విలువైన భూములను అప్పజెప్పాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకుడు గొర్రె శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ అక్రమంగా రూపాయి తీసుకున్నట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. అనంతరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమపై ఆరోపణలు చేసిన వారిపై విచారించాలని కోరారు.